## తుపానుతో తీవ్ర నష్టం

ప్రజాశక్తి - అనంతగిరి:మండలంలోని తుపాను ప్రభావంతో దుక్కటి పశువులు మృత్యువాతకు గురి కాగా నివాస ఇల్లు కూలిపోయాయి. దీంతో రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారని ఎన్ఆర్ పురం సర్పంచ్ బద్నాయన సన్యమ్మ, మాజీ సర్పంచ్ బి రామయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తుపాను కారణంగా సిమిడివలస గ్రామానికి చెందిన కోటపర్తి జోగయ్య కు చెందిన రెండు దుక్కటెద్దులు, గంగులు, సోమ్మెల జోకులు, గుద్దెల అప్పలనాయుడు చెందిన ఇల్లు దెబ్బతిన్నాయన్నారు.

మృతి చెందిన పశువులు వద్ద బాధిత రైతు

# తుపాను బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

## -పలు మండలాల్లో పంట పొలాలను పరిశీలించిన సిపిఎం నేతలు

రాజవొమ్మంగిలో పంటను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

**మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో వీచిన గాలులు, ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో దెబ్బతిన్న పంటలను సిపిఎం, రైతు, ప్రజా సంఘాల నాయకులు గురువారం పరిశీలించారు. పంటలను నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు., వర్గ సభ్యులు సురేంద్ర.**

**దుంబ్రిగుడ:** మిచౌంగ్ తుఫాన్ ప్రభావం కారణంగా వివిధ పంటలు కోల్పోయిన గిరి రైతులకు ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కే.సురేంద్ర డిమాండ్ చేశారు. మండలంలోని కంఠుం పంచాయితీ జాకర వలస గ్రామంలో గురువారం సిపిఎం బృందం సందర్శించి, తుపాన్ కారణంగా కోల్పోయిన వరి, రాజ్మా, వలిసెలు, చోళ్లు, చిక్కుడు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ తుపాను కారణంగా పంటలతో పాటు పలు రకాల కూరగాయల పంటలు నీట మునిగి పూర్తిగా పాడైపోయాయన్నారు. చేతి కంది వచ్చిన పంట వర్షాల కారణంగా పాడవడంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోకపోతే రైతులకు ఆకలి చావులు తప్పదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు టి సూర్యనారాయణ, కే.రామచందర్ పాల్గొన్నారు.

**చింతపల్లి:**అల్లూరి సీతారామరాజు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తాజంగి పంచాయితీలోని బలబద్రం, తాజంగి, గత్తం పాకలు తదితర గ్రామాల్లో దెబ్బతిన్న వరి పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాస్తో కూస్తో సాగునీరు అందుతున్న రైతులు మాత్రమే వరి పంటను వేసుకున్నారని, తుపాను ప్రభావంతో దెబ్బతిందన్నారు. కుప్పలు వేసుకున్న వరి కూడా తడవడంతో మొలకలు వస్తాయని, దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. గతంలో నష్టానికి తగ్గ పరిహారం ప్రభుత్వం చెల్లించలేదన్నారు.

**పెదబయలు:**మండలంలోని సీతగుంట పంచాయతీ రోగుల పేట గ్రామంలో వరి పొలాలను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు బోండా సన్నిబాబు మాట్లాడుతూ,మండల పరిధిలో సుమారు 1000కి పైగా రైతులు వరి పొలాలు కోల్పోయారన్నారు. అధికారులు పంట నష్టం అంచనా వేసి ఎకరాకు 25000 వేలు నష్టపరిహారం చెల్లించి, పెదబయలును కరువు మండలంగా ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సాగిన ధర్మన్న పడాల్, మండల కమిటీ సభ్యులు బొండా గంగాధర, బొండా ఆనంద, బొండా భీమన్న పాల్గొన్నారు,

**హుకుంపేట:** మండలం తాడిపుట్టులో ఓ రైతుకు చెందిన వరి పంటను ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు పరిశీలించి సహాయ చర్యల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామంలో పంట నష్టాన్ని అధికారులు చేపట్టక పోవడం బాధాకరమని ఆయన అన్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

**విఆర్ పురం:**తుపాన్ కారణంగా మండలంలో నీట మునిగిన పంటలను ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా, మండల నాయకులు గురువారం పరిశీలించారు. రైతులను పరామర్శించి వారికి జరిగిన నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు అప్పులు చేసి, లక్షల రూపాయలు పంటలపై పెట్టుబడి పెట్టారని, తుపాన్ రూపంలో వారికి తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. బాధిత రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, అధికారులు పంటలు ఈ-కాప్‌లో లేవని, నష్టపరిహారం ఇవ్వడం కుదరదని చెప్పడం దారుణమన్నారు. అటువంటి కుంటి సాకులు చెబితే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు కారం సుందరయ్య, పంకు సత్తిబాబు, గుండిపూడి లక్ష్మణరావు, సిరపు తాతబాబు, వీర్ల నాగేశ్వరరావు, నాల్పారపు ప్రకాశరావు, సోడి మల్లయ్య, సిహెచ్ సుబ్బారావు, రైతులు వెంకన్న బాబు పాల్గొన్నాడు.



హుకుంపేటలో పరిశీలిస్తున్న కృష్టారావు

విఆర్‌పురంలో పంటను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

పెదబయలులో పరిశీలిస్తున్న సన్నిబాబు

**రాజవొమ్మంగి :** మండలంలో వర్షాలకు నీట మునిగి తీవ్ర నష్టాలు చవి చూసిన రైతులకు ప్రభుత్వం రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, లోదొడ్డి సర్పంచ్ లోతా రామారావు డిమాండ్ చేశారు, లోదొడ్డి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గురువారం సిపిఎం బృందం పర్యటించింది. లోదొడ్డి, పూదేడు, కేశవరం, పాకవెల్తి గ్రామాలలో మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, రెండు రోజులు కురిసిన భారీ వర్షాలకు చేతికొచ్చిన పంట నీళ్లపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు సర్వే చేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మేలిన రమేష్, పొత్తురు సత్యనారాయణ, పోలిశెట్టి లావరాజు, గోము బుల్లబ్బాయి, ఎమ్.మురళి, ఎమ్ సురేష్, ఎల్.అర్జున్, జె అబ్బాయి, చెల్లారావు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

**చింతూరు :** మండలంలోని ఏడుగురాళ్లపల్లిలో తుఫాన్ వల్ల నష్టపోయిన మిర్చి, పత్తి, వరి, మినుము, నువ్వు పంటలను సిపిఎం చింతూరు మండల కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లం సుబ్బమ్మ ఆధ్వర్యాన గురువారం పరిశీలించారు. వర్షం, గాలులకు మిర్చి పంట పూర్తిగా పడిపోయి నష్టం జరిగిందని, చేతికి అందివచ్చిన పత్తి, వరి పంటలు నీటిపాలయ్యాయని రైతులు సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సుబ్బమ్మ మాట్లాడుతూ పత్తి, మిర్చి రైతులకు ఎకరాకు లక్ష రూపాయలు, వరికి ఎకరాకు రూ.50 వేలు చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సవలం కన్నయ్య, సవలం దేవసయ్య, లక్ష్మి, ముత్తయ్య, నాగులు పాల్గొన్నారు.

**కొయ్యూరు :** మండలంలోని రాజేంద్రపాలెంలో దెబ్బతిన్న పంటలను సిపిఎం మండల నాయకులు ఎస్ సూరిబాబు గురువారం పరిశీలించారు. తక్షణమే అధికారులు సర్వే చేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తహాశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

## నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి-కూనవరం

మిచౌంగ్ తూఫాన్ వల్ల పంటలు నష్టపోయిన ప్రతి రైతుకూ నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం నాయకులు గురువారం మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య మాట్లాడుతూ విలీన మండలాల్లో ప్రతి ఏటా అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన రైతులు, ఇప్పుడు పంట దెబ్బతినడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రకాల పంటలకు ఎకరాకు 50 వేల నుండి లక్ష రూపాయలు వరకు పంట నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతా రామయ్య, జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, సర్పంచ్ మడకం నాగమణి, సీనియర్ నాయకులు నాగరాజు, తాళ్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పొగాకు పంటను పరిశీలిస్తున్న జనసేన నాయకులు

## పంటలను పరిశీలించిన జనసేన నాయకులు

ప్రజాశక్తి-విఆర్.పురం

జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ ఆ పార్టీ నాయకులు తుపాన్‌కు నష్టపోయిన పంట పొలాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రంపచోడవరం నియోజకవర్గ నాయకులు కుర్ల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నష్టపోయిన మిర్చి, పొగాకు, వరి ఇతర పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు బాగుల ప్రమీల, కెచ్చల పోసిరెడ్డి, పెట్ట నాగేంద్రబాబు, కొనతం వాసు, సమ్మరాజు, మణికంఠ, పవన్ కళ్యాణ్, సాయిబాబు, దుర్గా ప్రసాద్, పవన్, శేఖర్ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న నాయకులు

## మృతుల కుటుంబాలకు పరామర్శ

**ప్రజాశక్తి-అనంతగిరి:**మండలంలోని నాన్ షెడ్యూల్ భీంపోలు పంచాయితీ పరిధి సీతపాడు గ్రామానికి చెందిన ముగ్గురు గిరిజనులు గల్లంతుతో బాదిత కుటుంబాలను అరకు ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు, ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్, స్థానిక జెడ్పిటిసి డి,గంగరాజు, ఎంపీపీ శెట్టి నీలవేణిలు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హర్షిత్ రాజ్యం, తహశీల్దార్ రామ్ భాయి, ఆర్ఐ శంకర్రావు, డీటీ రామ్మూర్తి పాల్గొన్నారు.

## రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలి

### జెడ్పిటిసి గంగరాజు

**ప్రజాశక్తి -అనంతగిరి:**లువా గోస్తాని గెడ్డ దాటుతూ గల్లంతైన ముగ్గురు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ 10 లక్షలు పరిహారం తక్షణమే చెల్లించాలని స్థానిక జడ్పిటిసి డి.గంగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పంచాయితీ పరిధి సీతపాడు గ్రామానికి చెందిన గెమ్మెల లక్ష్మి, మిరియాల కుమార్, గెమ్మెల కమల ఈ ప్రమాదానికి గురయ్యారన్నారు.అంగన్వాడి టీచర్ కుటుంబానికే ఉద్యోగం కల్పించాలన్నారు. ఆ వంతెన బ్రిడ్జి నిర్మించాలన్నారు.ఆయా గ్రామాలకు రోడ్డు సౌకర్యాలతో పాటు బ్రిడ్జిల నిర్మాణాలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఓదార్పుకు వచ్చిన ఎమ్మెల్యే పాల్గుణ, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, ఎస్టీ చైర్పర్సన్ శంకర్రావు, ఐటీడీఏ పీవో అభిషేక్‌ల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు టోకూరు సర్పంచ్ కె.మొస్య, మండల నాయకులు జి,దేవన్న, వి, బుద్రయ్య, కృష్ణ, సింగులు పాల్గొన్నారు.

## టిడిపి నేతల సంబరాలు

**ప్రజాశక్తి -హుకుంపేట:**అరకు అసెంబ్లీకి ఇన్చార్జిగా సివేరి దొన్నుదొర, పార్లమెంట్ అధ్యక్షులుగా కిడారి శ్రావణ్ కూమర్‌లను నియమిస్తూ ఉత్తర్వుల జారీ చేయడంతో మండలంలో టిడిపి శ్రేణులు స్థానిక బస్సుల షెల్టర్ వద్దకు గురువారం కేక్ కటింగ్ చేసి సంబరాలు చేశారు. టిడిపి అధినేత నారాచంద్ర బాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చనాయుడులకు అభినందనలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో. టిడిపి సీనియర్ నాయకులు బొడ్డ శ్యామ్, ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొర్రా సంతోష్ కుమార్, సర్పంచ్ పాడి బాలన్న, సూపర్ సర్పంచ్.లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ శతక బొంజుబాబు, నాయకులు సుబ్బారావు, టిడిపి మండల అధ్యక్షుడు కొర్రా తులసిరావు, సీనియర్ నేత శెట్టి లక్ష్మణు, నాగేష్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టిడిపి నేతలు

# అన్ని మండలాల్లోనూ ధాన్యం కొనుగోలు

### ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అన్ని మండలాల్లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. దేవీపట్నం మండలం శరభవరం గ్రామంలో గురువారం ధాన్యం కళ్లం దగ్గరకు పిఒ వెళ్లి పరిశీలించారు. మూడు రోజులపాటు భారీ వర్షాల వలన వరి పంట వేసిన రైతులకు నష్టం జరిగిందా? లేదనేది రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో బయోమెట్రిక్ ఏర్పాటు చేశామని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని జియో టాకింగ్ ద్వారా ఎంపిక చేసిన మిల్లులకు వాహనాల ద్వారా తరలించడం జరుగుతుందని చెప్పారు. గత సంవత్సరం జిల్లాలో 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఈ ఏడాది 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మండలంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన పరికరాలు ఏ విధంగా పని చేస్తున్నాయి, గోనె సంచులు ఎన్ని వేలు తీసుకువచ్చింది తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ అధికారి వెంట అగ్రికల్చరల్ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్‌కెవి చౌదరి, మండల వ్యవసాయ శాఖ అధికారి పాల్గొన్నారు.

శరభవరం గ్రామంలో వరి పంటను పరిశీలిస్తున్న ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే

# 202 హెక్టార్లలో వరి పంటకు నష్టం

ప్రజాశక్తి-కొయ్యూరు

మిచౌంగ్ తుపాన్ కారణంగా కొయ్యూరు మండలంలో 202 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఉమాదేవి తెలిపారు. ముంపునకు గురైన పంట పొలాలను గురువారం పరిశీలించిన ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రెండు రోజుల నుంచి తుఫాను ప్రభావిత గ్రామాలను సందర్శించి క్షేత్రస్థాయిలో వరి పొలాలు పరిశీలించామని చెప్పారు. పూర్తిగా నీటిలో తడిసి ఉన్న ధాన్యం రంగు మారకుండా ఉండడానికి వరి పొలంలో ధాన్యం పనల మీద ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు భరోసా కేంద్రాల వద్ద వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. రంగు మారిన ధాన్యం కూడా తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు తుఫాను ప్రభావిత గ్రామాలలో నీట మునిగిన వరి పంటలకు జరిగిన నష్టం తీవ్రతను పరిశీలించి గణన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని చెప్పారు.

తుపాన్‌కు నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ఉమాదేవి

## సిఐగా బాజీలాల్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -కొయ్యూరు

కొయ్యూరు పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్‌కె.బాజీలాల్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ సీఐగా పనిచేసిన ఎ.స్వామినాయుడును రాజవొమ్మంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేసిన ఉన్నతాధికారులు, రాజవొమ్మంగి సిఐగా పని పనిచేస్తున్న బాజీలాల్‌ను కొయ్యూరు సిఐగా నియమించారు. సిఐగా బాధ్యతలు చేపట్టిన బాజీలాల్‌కు కొయ్యూరు, మంప ఎస్‌ఐలు అభినందనలు తెలిపారు.

స్వామినాయుడు నుండి బాధ్యతలు స్వీకరిస్తున్న బాజీలాల్

పోలిశెట్టి వెంకటరమణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

## పోలిశెట్టి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని లోదొడ్డి పంచాయతీ పరిధి పూదేడు గ్రామంలో సిపిఎం నాయకులు కామ్రేడ్ పోలిశెట్టి వెంకట రమణ రెండో వర్ధంతి కార్యక్రమం సీపీయం మండల నాయకులు పొత్తురు సత్యనారాయణ అధ్యక్షతన గురువారం జరిగింది. ఇందులో పాల్గొన్న సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, ఇతర సిపిఎం నాయకులు వెంకటరమణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ, వెంకటరమణ 16 సంవత్సరాల పాటు పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేశారని తెలిపారు. ప్రజానాట్య మండలి లోదొడ్డి పంచాయతీ టీమ్‌కి బాధ్యులుగా ఉంటూ రంపచోడవరం డివిజన్‌లో ఎక్కడ పార్టీ కార్యక్రమాలు జరిగినా డప్పుకొట్టి లయబద్ధంగా పాటలుపాడి అలరించే వారిని గుర్తు చేశారు. ఆయన ఏజెన్సీ గ్రామాల్లో వైద్యుడిగా కూడా మంచి సేవలు అందించారన్నారు. వెంకటరమణ మృతి ప్రజానాట్య మండలికి, పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. సిపిఎంకు ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు మేలిన రమేష్, మేలిన మురళి, సురేష్, పోలిశెట్టి లోవరాజు, వెలుసూరి సుబ్బారావు, గోము బుల్లబ్బాయి, మూడు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం గుమ్మరేవుల పంచాయితీ కనుసుమెట్టలో నాలుగు లక్షల రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణ పనులను సర్పంచి మురళి కమలమ్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా బొరుకుల గొంది మధ్య కలుసు మెట్ట మార్గమధ్యంలో రహదారి సౌకర్యం లేక అనే ఇబ్బందులు గురయ్యారని తెలిపారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి, అధికారులకు అనేకసార్లు విన్నవించగా స్పందించి రహదారికి ఏర్పాటు ట్రైబల్ వెల్ఫేర్ నుండి నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. సీసీ రోడ్డు రహదారి పనులు పూర్తయితే ఆయా గ్రామానికి రహదారి సౌకర్యం పూర్తిస్థాయిలో కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిసి రోడ్డును నిర్మిస్తున్న దృశ్యం

## గిరిజన మహిళలకు ఆటోల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు:స్వయం సహాయక సంఘాల గిరిజన మహిళలకు ఉన్నతికి మహిళా శక్తి పథకంలో మంజూరు చేసిన మహిళా శక్తి ఆటోలను ఐటిడిఏ పిఓ వి. అభిషేక్ గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) పరిధిలో ఉన్నతి కార్యక్రమం లో ఆరుగురు మహిళలకు వడ్డీ లేని రుణం కింద రూ.3.30 లక్షల విలువైన ఆటోలను మంజూరు చేయడం జరిగిందన్నారు. లబ్ధిదారుని వాటాకింద రూ.30,343 లు చెల్లించాలని చెప్పారు. సెర్ప్ నుండి రూ.3 లక్షలు వడ్డీ లేని రుణం ద్వారా ఆటో రిక్షాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. 48 వాయిదాలలో రుణం తిరిగి చెల్లించాలని సూచించారు. ఆడ, మగ బిడ్డలనే వ్యత్యాసం లేకుండా పిల్లలను పెంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకరరావు, ఎం. వేంకటేశ్వరరావు, డిఆర్‌డిఏ పిడి వి.మురళి, ప్రత్యేక ఉప కలెక్టర్ వి.వి. ఎస్. శర్మ, వెలుగు ఎపిఎంలు వి.ఎస్. ప్రసాద్, చిన్నారావు, వెలుగు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## నేటి స్పందన వాయిదా

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల8న శుక్రవారం జరుగనున్న జగనన్నకు చెబుదాం స్పందన ప్రత్యేక కార్యక్రమం అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయం గమనించి శుక్రవారం స్పందనకు హాజరు కారాదని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఆ స్పందన ఈనెల 14న పాడేరు ఐటిడిఏ సమావేశ మందిరంలో జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

## మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాధం

ప్రజాశక్తి -యస్.రాయవరం:తుపానుతో తీవ్రంగా నష్ట పోయిన మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. బంగారమ్మపాలెంలో తుపానుతో బోట్లు, వలలు, ఇంజన్‌లు పూర్తిగా నష్టపోయిన బాధిత మత్యకారులను సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాధం పార్టీ నాయకులతో కలిసి గురువారం పరామర్శించారు. దెబ్బతిన్న బోట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, ప్రభుత్వం స్పందించి నష్టపోయిన మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. గత వారం రోజులుగా తుఫాన్ కారణంగా వేటకు వెళ్ళక ఉపాధి లేకుండా ఉన్న మత్స్యకారులకు బియ్యం, నిత్యావసర సరుకులు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.రాజు, మండల కన్వీనర్ ఎం.సత్యనారాయణ, వి.అప్పలరాజు, వై.రామకృష్ణ, సి.హెచ్.రమణ పాల్గొన్నారు.

## వీవర్స్ కాలనీలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- నక్కపల్లి:మిచౌంగ్ తుపాన్ ప్రభావానికి ముంపునకు గురైన నక్కపల్లి వీవర్స్ కాలనీలో గురువారం ముమ్మరంగా శానిటేషన్ పనులు చేపట్టారు. వీవర్స్ కాలనీ ముంపునకు గురి కావడంతో ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో చేనేత మగ్గాలు, ముడి సరుకులు, సామాగ్రి తడిసి చేనేత కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. ఎంపీపీ రత్నం, వైస్ ఎంపీపీ నానాజీ, ఈఓపిఆర్‌డి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో కాలనీలో శానిటేషన్ పనులు చేపట్టారు. కాలువలను శుభ్రం చేయించి, బ్లీచింగ్ జల్లించారు. డిఎల్‌పిఓ మూర్తి కాలనీలో పర్యటించి, శానిటేషన్ పనులను పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ శానిటేషన్ పనులు చేపట్టాలని పంచాయతీ అధికారులకు ఆదేశించారు.

## కూలిన హైస్కూల్ ప్రహరీ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని గొడిచెర్లలో తుఫాన్ ప్రభావానికి కురిసిన వర్షానికి హైస్కూల్ ప్రహరీ గోడ కుప్ప కూలి పోయింది. గురువారం హెచ్‌ఎంతో పాటు సర్పంచ్ భర్త అల్లు రమణ, తదితరులు కూలిన గోడను పరిశీలించారు. సుమారుగా రెండు లక్షల నష్టం వాటిల్లినట్లు హెచ్ఎం తెలిపారు. అధికారులు స్పందించి ప్రహరి గోడ మంజూరు చేయాలని అల్లు రమణ కోరారు

## పాకలపాడు రోడ్డు అస్తవ్యస్తం

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం పాకలపాడు నుంచి రావణాపల్లి వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా మారింది. రెండు కిలో మీటర్ల మేర ఈ రోడ్డంతా పూర్తిగా దెబ్బ తినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ద్విచక్ర వాహనదారులు పడిపోయి గాయాలు పాలైన సంఘటనలు ఉన్నాయి. తక్షణమే ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

# పంటల నష్టాన్ని అంచనా వేయాలి

### జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

పంట నష్టాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: మిరియాల పంటకు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందని, ఇటువంటి సమయంలో రైతులు ఆచి తూచి మంచి గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో కురిసిన వర్షాలకు పాడైన పంట నష్టాల పరిశీలనకు మండలంలోని వంతాడపల్లి, తుంపాడ, వి.కరకపుట్టు గ్రామాలలోని పంట పొలాలను గురువారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిరియాలను కిలో రూ.500లకు తగ్గకుండా అమ్మాలని సూచించారు. గత ఏడాది కూడా రూ.500 లకు తక్కువ లేకుండా అమ్మిన విషయాన్ని గుర్తు చేసారు. మధ్య దళారీలను నమ్మకుండా నేరుగా వర్తకులకు అమ్మడం ద్వారా ఎక్కువ లబ్ధి పొందవచ్చని వివరించారు. ఒకవేళ వర్తకులు తగిన ధర చెల్లించటానికి ముందుకు రాని పక్షంలో ఫిబ్రవరి, మార్చి నెలల వరకు ఆగితే ఇంకా మంచి ధర వస్తుందన్నారు. అనంతరం పంట పొలాలను పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ, పంట నష్టాలను అంచనా వేయాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని కలెక్టర్ స్పష్టం చేసారు. పంట పొలాలలో తడిస్తే ధాన్యం రంగు మారకుండా, మొలకేత్తకుండా ఉండేందుకు ఒక లీటరు నీటిలో 50 గ్రాముల ఉప్పు కలిపిన నీటిని పిచికారి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బిఎస్ నంద్, వ్యవసాయాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాఫీకి గిట్టుబాటు ధర : పిఓ అభిషేక్

ప్రజాశక్తి-హుకుంపేట: గిరిజన రైతులు కాఫీ ఫలసాయాన్ని మంచి గిట్టుబాటు ధరకు విక్రయించాలని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ సూచించారు. గురువారం సంతారి పంచాయతీ లోచలిపుట్టు గ్రామంలో పర్యటించారు. గిరిజన రైతులతో మాట్లాడుతూ తుఫాను పంట నష్టాలపై ఆరా తీసారు. కాఫీ పార్చిమెంటును గిరిజన సహాకార సంస్థ ఎంత ధరకు కొనుగోలు చేస్తుందని రైతులను అడిగి తెలుసుకున్నారు. పార్చిమెంటును జిసిసి రూ.280 ధరకు కొనుగోలు చేస్తుందని రైతులు చెప్పారు. చింతపల్లి మాక్స్ సంస్థ ద్వారా కాఫీ పళ్లను కిలో రూ.43 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారన్నారు. జిసిసి ధరలకు, మాక్స్ సంస్థ ధరల కంటే తక్కువకు దళారులకు విక్రయించ కూడదని సూచించారు. మంచి ధర వచ్చేవరకు పార్చిమెంటును నిల్వ చేసి ఉంచాలని స్పష్టం చేసారు. ఎకరాకి సుమారు రూ.60 వేలు ఆదాయం రావాలఅన్నారు. మిరియాలను కిలో ఐదువందలకు పైబడి విక్రయించాలని పేర్కొన్నారు. కాఫీ విక్రయాలపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. దళారులు ఎ గ్రేడుకు ఒక ధర, బి గ్రేడుకు ఒక ధర చెల్లించి రైతులను మోసం చేస్తున్నారని చెప్పారు. చింతపల్లి మాక్స్ సంస్థ అన్ని రకాల కాఫీ పళ్లకు కిలోకు రూ.43 లు చెల్లిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రాజ్యలక్ష్మి, ఎంపిడిఓ వెంకటరావు, స్థానిక సర్పంచ్ పాడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

పాడైన పంటలను పరిశీలిస్తున్న పిఓ అభిషేక్

# నేడు కొండ గుడి పండగ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరంలో ప్రసిద్ధి చెందిన 'కొండ గుడి మేరీ మాత' ఉత్సవ సంబరం శుక్రవారం రోజిహిల్స్‌పై జరుగనుంది. ఏటా డిసెంబర్ 8వ తేదీన పండగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చారిత్రాత్మకంగా చూసినప్పుడు క్రిష్టియన్లకు ఇది అత్యంత ప్రియమైన పండగగా వస్తోంది. 1854 సంవత్సరం నుంచి ఈ కొండగుడి ఉత్సవాన్ని జరుపుతున్నట్లు చరిత్ర ద్వారా వెల్లడవుతోంది. మేరిమాతను కొలిచే భక్తులంతా విశాఖలోని వన్ టౌన్ ఏరియాలో గల కొండగుడికి డిసెంబర్ 8న వేల సంఖ్యలో రావడం ఆవాయితీగా వస్తోంది. నవంబర్ 29న పతాక ఆవిష్కరణతో నవదిన ప్రార్ధనలు ప్రారంభమై పండగ రోజు డిసెంబరు 8న కానుకలు ఏమైనా సమర్పించదలిస్తే గురువులు, బ్రదర్స్ కన్యలకు మాత్రమే ఇవ్వాలని, అది కూడా గుడిలోపల మేరిమాత గుహ వద్ద గుడిముందున్న స్వరూపం వద్ద మాత్రమే యాత్రికులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. జపమాలలు, కొవ్వొత్తులు, పాటల సీడీలు గుడి ఆవరణలో పెద్ద ఎత్తున అందుబాటులో ఉంచారు. కొండపైకి భక్తులను శుక్రవారం తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి అనుమతిస్తారు. దేశం నలుమూలల నుంచి ఈ పండగకు భక్తులు ఏటా వేల సంఖ్యలో వస్తుంటారు. వారికి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

#### ట్రాఫిక్ ఆంక్షలు

గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం అర్ధరాత్రి వరకు పోర్టు ఏరియా రోజ్ హిల్స్ కొండపై జరిగే పండగ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలను పోలీసులు ప్రకటించారు.

## 78 ఎకరాల్లో పంట నష్టం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో మించౌంగ్ తుపాను తీవ్రతతో 78 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారిణి నీలిమ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, తుపాను ప్రభావంతో కోత కోసిన 4 ఎకరాల వరి పంటను పొలాల్లోనే రైతులు జాగ్రత్తలు పాటించి వరదనీటిని మళ్లించి రక్షణ కల్పించారన్నారు. 10ఎకరాల్లో రాగి పంట పూర్తిగా పోయిందన్నారు. పంట నష్ట నివారణ చర్యల్లో భాగంగా సిబ్బందితో సర్వే చేస్తున్నామన్నారు నష్టపోయిన రైతులందరికీ ఆర్థిక సాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఎవరు అధైర్య పడద్దని ఆమె సూచించారు.

## బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మిచౌంగ్ తుపాను కారణంగా నివాస గృహాలు కూలిన బాదితులకు ప్రభుత్వం అర్థిక సాయం చేసి ఆదుకోవాలని అరుకు పంచాయతీ సర్పంచ్ జీ.శారద డిమాండ్ చేశారు. మండలంలోని అరకు పంచాయతీ అరకు సంతబయలు గ్రామంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి ఇద్దరు గిరిజనుల నివాస గృహాలు కూలి పోవడంతో గురువారం సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, తల దాచుకోవడానికి ఉన్న చిన్న ఇల్లు కూలి పోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారు నిరుపేదలు కావడంతో పునార్నిర్మించుకోవడానికి ఆర్థిక స్తోమత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

## ఆర్‌బికెల్లో తడిసిన ధాన్యం కొనుగోలు

### డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడు

ప్రజాశక్తి -చీడికాడ:తుఫాన్ కారణంగా వరి, చెరుకు, ఇతర పంటల నష్టాన్ని అంచనా వేయించి తగిన నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇచ్చి రైతులను ఆదుకుంటుందని డిప్యూటీ సిఎం, మంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. తడిసిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయన గురువారం మండల నాయకులతో స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తుఫాన్ కారణంగా రైతులు కష్టించి పండించిన వరి పంటలు నీటిపాలు కావడం బాధ అని పించిందన్నారు.తుఫాన్‌కి ముందుగా అధికారులను, రైతులను అప్రమత్తం చేయడంతో నష్టం కొంత మేర తగ్గిందన్నారు. నీటిలో మునిగిన పంటలను అధికారులతో అంచనా వేయించి నివేదికలను నష్ట పరిహారం అందేలా చూస్తామన్నారు. వారం రోజుల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు సిబ్బందిని సిద్ధం చేసి చేపడతామని మంత్రి అన్నారు. తుఫాన్ కారణంగా పెంకిటిల్లులు పడిపోయిన, పాడైనా పది వేలు అందజేయాలని అధికారులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు జి.రాజబాబు, జిల్లా రైతు అధ్యక్షులు ఎర్ర అప్పారావు, నాయకులు కురచా నారాయణమూర్తి, పాల సంఘం అధ్యక్షులు కొండబాబు, యువజన అధ్యక్షులు స్వామి నాయుడు, పడాల అప్పలనాయుడు, శ్రీను సలాది శేషు, కార్యకర్తలు పాల్గొన్నారు.

#### ముంపు ప్రాంతాల్లో పర్యటన

మాడుగుల: మండలంలోని తుఫానుతో ముంపుకు గురైన ప్రాంతాలను ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పరిశీలించారు. గురువారం తుఫానుతో మండలంలో జరిగిన నష్టాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. తుఫాను దాటికి నీట మునిగిన రైతులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు నష్టపోయిన రైతులతో మాట్లాడుతూ జరిగిన విపత్తు వల్ల వాటిల్లిన నష్టాన్ని ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తుఫాను కారణంగా వచ్చిన నష్టాన్ని అధికారులు అంచనా వేసి ప్రభుత్వంకు నివేదిక అందించాలని సూచించారు. మాడుగుల నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎం.పోలినాయుడు పర్యవేక్షణతో నియోజకవర్గంలో నష్టపోయిన రైతులకు వెంటనే ఆర్థిక సాయం అందించే విధంగా సూచనలు అందించారు. రైతులు ధైర్యం వహించాలని ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహాయక చర్యలు అందిస్తామని ముత్యాల నాయుడు హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో లోతట్టు ప్రాంతాలైన వీరవిల్లి అగ్రహారం, పోతనపూడి, గొట్టివాడ అగ్రహారం, చింతలూరు వీరనారాయణం, అలాగే గండిపడిన కలవట్లను, చిన్న గొర్రెగడ్డ గ్రామానికి చెందిన వంతెనను పరిశీలించారు. మండలంలో వాహనాలు ప్రయాణం చేయలేని ప్రాంతాలలో ద్విచక్ర వాహనంపై మంత్రి పర్యటించిపరిస్థితులు తెలుసుకున్నారు. మంత్రి వెంట వైస్ ఎంపీపీ తాళపు రెడ్డి వెంకట రాజారామ్, డిప్యూటీ తాసిల్దార్ పి సత్యనారాయణ, నీటిపారుదల శాఖ ఏఈ భార్గవ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, గ్రామ నాయకులు రైతులు ఉన్నారు.

# మందుబాబుల సామాజిక సేవ

### డ్రంకెన్ డ్రైవ్ కేసులో కోర్టు తీర్పు... జరిమానా విధింపు

శుభ్రపరిచే పనులు చేస్తున్న డ్రంకెన్ డ్రైవ్ కేసు నిందితులు

ప్రజాశక్తి - ఆనందపురం :డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన మందుబాబులకు ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమానా, సామాజిక సేవ చేయాలని భీమునిపట్నం 15వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జి విజయలక్ష్మి తీర్పునిచ్చారు. ఇటీవల పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం మత్తులో వాహనాలు నడిపిన 65మందిపై కేసులు నమోదు చేశారు. నిందితులను స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ అప్పలరాజు కోర్టులో ప్రవేశపెట్టగా, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. సామాజిక సేవ చేయాలన్న న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులతో భీమిలి ఎఎంజి పాఠశాల, భీమిలి ఇండోర్ స్టేడియం పరిసరాలను పరిశుభ్రం చేయించారు.

## జనసేనలో చేరిన సుందరపు

సతీష్‌కుమార్‌ను జనసేన పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి, యలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ సోదరుడు సుందరపు వెంకట సతీష్ కుమార్ గురువారం సాయంత్రం ఎంవిపి కాలనీలోని ఎఎస్.రాజా కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ పార్టీ ప్రారంభం నుంచీ సతీష్‌కుమార్ పార్టీకి విశేషంగా సేవలందిస్తున్నారన్నారు. ఆయనను పార్టీలోకి రావాలని ఎప్పుడో కోరానని, ఇంతకాలానికి ఆయన మనసు మార్చుకుని పార్టీలో చేరడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఆయన చేరిక ద్వారా ఉత్తరాంధ్రలో పార్టీ మరింత బలోపేతం అవుతందన్నారు.

అనంతరం సుందరపు వెంకట సతీష్ కుమార్ మాట్లాడుతూ, పవన్ రాష్ట్ర ప్రయోజనాలకు పెద్ద పీట వేసే నాయకుడని అన్నారు. ఇప్పటివరకు పార్టీకి వెనుక ఉండి సేవలందించానని, ఇక నుంచి ప్రత్యక్షంగా ప్రజలకు సేవ చేసేందుకు పార్టీలో చేరానని, తనను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన యలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్, పార్టీ నాయకులు నాదెండ్ల మనోహర్, నాగబాబు, పంచకర్ల సందీప్, వంపుల గంగులయ్య, బీసెట్టి వసంతలక్ష్మి, మూగి శ్రీనివాసరావు, పరుచూరి భాస్కరరావు, పసుపులేటి ఉషాకిరణ్, బోడపాటి శివదత్త, పాలవలస యశస్వి, కందుల నాగరాజు, దల్లి గోవింద్, పివిఎస్ఎన్.రాజు, బొలిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

# రూ.100 కోట్లతో గీతం పరిశోధనా కేంద్రాలు

### పర్యావరణం, ప్రజారోగ్య హితమైన ఉత్పత్తులే లక్ష్యం

### వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం

ప్రజాశక్తి- మధురవాడ : బోధనతో పాటు పరిశోధనలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రూ.100కోట్లతో పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని గీతం వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం వెల్లడించారు. శాస్త్ర విజ్ఞానంలో దేశం గర్వించదగ్గ అత్యున్నత పరిశోధనలను నిర్వహించాలనేది గీతం లక్ష్యమని స్పష్టం చేశారు.

గురువారం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న గీతం కెమిస్ట్రీ రీసెర్చి కాన్ఫడెన్స్-2023ను ప్రారంభించారు. ఇంజనీరింగ్, సైన్స్, ఫార్మశీ, వైద్యవిభాగాల మధ్య అనుసంధానంతో అంతర్విభాగ పరిశోధనలపై తాము దృష్టి సారిస్తున్నామన్నారు. రసాయనిక శాస్త్రవేత్తలు, పరిశోధకులు పరిశ్రమల నుంచి ప్రకృతికి హని కలిగించని పర్యావరణ హితం కోరే హరిత రసాయన ఉత్పత్తుల తయారుచేసే సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలన్నారు. ఆహర ఉత్పత్తుల వృద్ధికి క్రిమిసంహరకాలను, రసాయన ఎరువులను వాడటం సరికాదని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని శరీరంలో వ్యాధినిరోధకశక్తిని పెంచే ప్రత్యామ్నాయ ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని శాస్త్ర వేత్తలకు పిలుపునిచ్చారు.

జ్యోతిప్రజ్వలనతో సదస్సు ప్రారంభిస్తున్న గీతం విసి దయానంద

తిరువనంతపురంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి డైరక్టర్ ప్రొఫెసర్ జెఎన్.మూర్తి సైన్స్ పరిశోధనలకు గీతం వర్సిటీ ప్రాధాన్యతనివ్వడం అభినందనీయమన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ మాట్లాడుతూ శిలాజ ఇంధనాలు, ప్లాస్టిక్ వంటివి వర్యావరణాన్ని దెబ్బతీయకుండా హరిత రసాయన ఉత్పత్తులపై పరిశోధనలు జరపాలన్నారు. రసాయన విభాగం అధిపతి ప్రొఫెసర్ బి.శ్రీనివాసరావు విభాగం ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేదవతి, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్.శర్మ సదస్సు కన్వీనర్‌లు డాక్టర్ శివాజీ, బారక్, డాక్టర్ అనిక్‌సేన్, డాక్టర్ ఎ.జనా, డాక్టర్ భట్టాచార్య పాల్గొన్నారు.

## పింఛన్ల నగదు మాయంపై వాలంటీర్లను నిందించొద్దు

జెడ్‌సి ఫిర్యాదు చేస్తున్న వాలంటీర్లు

ప్రజాశక్తి -పిఎం.పాలెం: జివిఎంసి రెండో జోన్ కె3 కాలనీ 41వ సచివాలయంలో పింఛను నగదు మాయంపై సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ తమపై నిందారోపణలు చేస్తున్నారని స్థానిక వాలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం జెడ్‌సి కనకమహాలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఇటీవల 41వ సచివాలయం పరిధిలో రూ.49750 పింఛను నగదు మాయం కాగా, వెల్ఫేర్ సెక్రటరీ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఇంతలో మూడు నెలల క్రితమే రాజాం నుంచి బదిలీపై వచ్చిన వెల్ఫేర్ సెక్రటరీ వై.అన్నపూర్ణ, దీనికి వాలంటీర్లే కారణమని నిందారోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము నాలుగేళ్లుగా వాలంటీర్లుగా విధులు నిర్వహిస్తున్నామని, ఆలా ఎన్నడూ జరగలేదన్నారు. వెల్ఫేర్ సెక్రటరీ ఇక్కడ బాధ్యతలు చేపట్టిన తర్వాతే గడచిన రెండు నెలల్లో రూ.15వేలు, రూ.5వేలు చొప్పున పింఛను నగదు మాయంకాగా, ఆ సొమ్మును వెల్ఫేర్ సెక్రటరీ భరించిందన్నారు. ఈ నెలలో ఏకంగా రూ.49,750 నగదు మాయంపై నేరాన్ని తమపై మోపుతున్నారని వాలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదుపై విచారణ జరుగుతున్న సమయంలో వెల్ఫేర్ సెక్రటరీ తమపట్ల దురుసుగా ప్రవర్తించడం సరిదన్నారు, వెల్ఫేర్ సెక్రటరీ తీరుతో వేదనకు గురౌతున్న నేపథ్యంలో పింఛను నగదు మాయం వ్యవహారంలో దోషులు తేలేవరకు వేరే వెల్ఫేర్ సెక్రటరీని నియమించాలని కోరారు.

## ఉత్సాహంగా సెమినార్లు

ప్రజాశక్తి -ములగాడ :సెయింట్ ఆన్స్ కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నాయకత్వం, విపత్తుల నిర్వహణ, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, న్యాయం, రాజ్యాంగం ఇలా వివిధ అంశాలపై సెమినార్లు ఉత్సాహంగా సాగుతున్నాయి. నెలరోజులుగా నిర్వహిస్తున్న సెమినార్లలో పాల్గొన్న పలువురు విద్యార్థినులు అధ్యయన పత్రాలను సమర్పించారు.

బృంద చర్చల్లో మరికొందరు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రతిభ కనబరిచిన వారికి రాజనీతిశాస్త్ర విభాగ అధ్యాపకులు ఇపిఎస్. భాగ్యలక్ష్మి, వై.అనసూయదేవి ప్రశంసాపత్రాలను, బహుమతులను అందజేసి అభినందించారు. ఇటువంటి సదస్సుల వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తి బయటపడుతుందనిన్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అభినందించారు.

## వేర్వేరుచోట్ల 20 లీటర్ల నాటుసారా స్వాధీనం

# ముగ్గురు నిందితుల అరెస్టు

పోలీసులు అరెస్ట్ చేసిన సారా నిందితులు

ప్రజాశక్తి- కొయ్యూరు : వేర్వేరు చోట చేసిన దాడుల్లో 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై రాజారావు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... కొయ్యూరు మండలం, సూరేంద్రపాలెం గ్రామ శివారులో నాటుసారా తయారు చేసి, విక్రయాలు చేస్తున్నట్లు పోలీసులకు అందిన ముందస్తు సమాచారం మేరకు, ఎస్ఐ రాజారావు తమ సిబ్బందితో గురువారం దాడులు నిర్వహించారు. ఒక చోట 10 లీటర్ల నాటుసారాతో అంబటి గంగమ్మ, మరో చోట మరో 10 లీటర్ల నాటుసారాతో సాగిన దేవి, అరిమెల ఆదిలక్ష్మి పట్టుబడ్డారు. ఈ మేరకు వారి వద్ద నుంచి నాటుసారా స్వాధీనం చేసుకుని, ముగ్గురు మహిళలను అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజారావు తెలిపారు. ఎవరైనా నాటుసారా తయారీ, క్రయ విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## సన్‌రైజ్ ఆసుపత్రి వార్షికోత్సవం సందర్భంగా

## 9,10 తేదీల్లో పిల్లలకు ఉచిత పరీక్షలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక సన్‌రైజ్ చిల్డ్రన్ హాస్పిటల్ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 9 10 తేదీల్లో తెల్ల రేషన్‌కార్డు కలిగిన కుటుంబాల్లోని పిల్లలకు ఉచిత ఒపిడితోపాటు, ఉచిత రక్త పరీక్షలు చేయనున్నట్లు హాస్పిటల్ ఎండి డాక్టర్ టి తిరుపతిరావు తెలిపారు. గాజువాకలోని సన్‌రైజ్ ఆసుపత్రితోపాటు, మర్రిపాలెం సుజాతనగర్, పరవాడలోని తమ ఆసుపత్రుల్లో ఈ ఉచిత సేవలు అందుబాటులో ఉంటాయని, ఆయా ప్రాంతాల్లోని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95603 77799,70366 44666 ఫోన్‌నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

## ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఆలయ ధర్మకర్త రమేష్‌స్వామి ఆధ్వర్యంలో గురువారం పడిపూజ ఘనంగా నిర్వహించారు. సుమారు 30 మందికి పైగా అయ్యప్ప స్వాములు మాలలు ధరించి దీక్ష భూని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏపీ జెన్కో మోతుగూడెం ఓ అండ్ డ్యాం ఎస్ఈ వెంకటేశ్వరరావు ఆర్థిక సాయంతో స్వామివారి సన్నిధిలో గురువారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చేసింది. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## స్కేటింగ్ చిన్నారి సింధుకు అభినందన

ప్రజాశక్తి - ఆరిలోవ: క్రీడలలో విశాఖ కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో తీసుకువెళ్లాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆకాంక్షించారు.. గురువారం జాతీయ స్కేటింగ్ పోటీలలో పతకాలు సాధించిన నాలుగేళ్ల చిన్నారి ఎ.సింధును క్యాంప్ కార్యాలయంలో మేయర్ అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ హిమాచలప్రదేశ్ ధర్మశాలలో గతనెల28, 29 తేదీలలో నిర్వహించిన జాతీయస్థాయి స్కేటింగ్ ఇన్‌లైన్ స్పీడ్ అండ్ స్లో పోటీలలో చిన్నారి సింధు మూడు బంగారు, ఒక రజతపకం సాధించడం అభినందనీయమన్నారు. సింధును ఆమె తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు క్రీడల్లో ప్రోత్సాహించాలని సూచించారు. చిన్నగదిలి లిటిల్‌స్టార్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సింధు చదువుతోంది. ఉపాధ్యాయులు, కోచ్, సింధు తల్లిదండ్రులు పాల్గొన్నారు.